## మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



**దశ, రంగారెడ్డి:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ వినాయక చవితికి ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మట్టి గణపతిని పూజించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నివారించడంతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవచ్చన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వినియోగాన్ని తగ్గించి మట్టి విగ్రహాలను పూజించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను సూచించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ సూచించారు.

## బాలాపూర్ యూపీహెచ్‌సీలో వైద్య సేవలపై అదనపు కలెక్టర్ పరిశీలన



**దశ, బాలాపూర్:** బాలాపూర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) ను రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి గురువారం సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓపీ సేవలు, మందుల లభ్యత, సిబ్బంది హాజరు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. హెచ్‌పీవీ టీకా కార్యక్రమం అమలును ప్రత్యేకంగా పరిశీలించిన ఆమె.. అర్హులైన బాలికలందరికీ టీకా అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. టీకా ప్రాధాన్యతపై బాలికలు, తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డాక్టర్ కిరణ్మయి సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ స్వర్ణకుమారి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సత్యవతి, మెడికల్ ఆఫీసర్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్ అక్రమ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంతంగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించాలి



**దశ, హైదరాబాద్:** వినాయక చవితి ఉత్సవాలను పట్టణంలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని గౌరవ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. డీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పీస్ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలను పాటిస్తూ భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. ఉత్సవాలు విజయవంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సాగేందుకు అధికారులు, ఉత్సవ కమిటీలు, యువజన సంఘాలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో ఆర్డీఓ వి. శేఖర్‌రెడ్డి, డీఎస్పీ మధుసూదన్‌రెడ్డి, కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, సీఐ మన్మథకుమార్, రెండో వార్డు కౌన్సిలర్ పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్య, నాయకులు చింతల సాయిలు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.


## ఐలమ్మ పోరాట స్ఫూర్తిని యువత కొనసాగించాలి



**దశ ఓయూ:** చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని సమాజంలో జరుగుతున్న అణిచివేతకు వ్యతిరేకంగా పోరాడాలని ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మనబోయిన సైదులు యాదవ్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విసునూరు దేశ్‌ముఖ్‌లు, జమీందార్ల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఐలమ్మ ధైర్యంగా పోరాడారని తెలిపారు. భూమి, పంటపై హక్కు కోసం ఆమె సాగించిన పోరాటం తెలంగాణలో భూ పోరాట ఉద్యమానికి నాంది పలికిందన్నారు. ఐలమ్మ స్ఫూర్తితో విద్యార్థులు, యువత సామాజిక సమస్యలపై ఉద్యమించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి, ఏఐఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల మధు, జేవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చీరాల వంశీ, రామస్వామి, మహేష్, సృజన్, బరిగెల రాజు, ప్రభాకర్, సురేష్, రమేష్, సాయికిరణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# తాండూరులో బస్సులు నడపని ఆర్టీసీ

- ఆర్టీసీ ఆధ్వర్యంలో తాండూర్ టాప్
- ఉదయం సాయంత్రం భారీగా రద్దీ
- పట్టించుకోని ఆర్టీసీ యంత్రాంగం
- దూర ప్రాంతాల నుంచి రావడానికి కష్టంగా ఉంది
- ఐదు నిమిషాలకు ఒక బస్సు మహబూబ్‌నగర్ కి ఇప్పుడు 30 నిమిషాలకు ఒకటి
- సంగారెడ్డి బస్సు రెండు గంటలకు ఒకటి
- గ్రామాలను మర్చిపోయిన తాండూర్ ఆర్టీసీ




**దశ, తాండూర్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం వ్యాపారానికి పెట్టింది పేరు. తాండూరులో వివిధ వ్యాపార కార్యకారపాల్లో జోరుగా సాగుతాయి. అనేక గ్రామాల నుంచి తాండూరు పట్టణానికి నిత్యం వేల సంఖ్యలను ప్రజలు వస్తుంటారు. తాండూరు పట్టణంలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి వివిధ ట్రైన్ సౌకర్యాలు బస్సు సౌకర్యాలు కందుల మార్కెట్ ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలు ప్రైవేట్ కి సంబంధించిన అనేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇలా నిత్యం తాండూర్ ఎప్పుడు రద్దీగా ఉంటుంది కానీ ప్రయాణికులకు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థులు అయితే బస్సు డోర్ల దగ్గర నిలబడి అమ్మాయిలకు అయితే మరీ ఘోరంగా ఉంది అసలు కాలేజీకి వెళ్లాలా లేదా అనేది కూడా ఆలోచిస్తున్నారు.

### మహబూబ్ నగర్ కి 30 నిమిషాలకు ఒక బస్సు

ఒకప్పుడు మహబూబ్నగర్ కి ఐదు నిమిషాలకు ఒక బస్సు తప్పనిసరిగా వచ్చేది కానీ ఇప్పుడు 30 నిమిషాలు అయినా ఒక బస్సు రావడం లేదు వస్తుందన్న గ్యారెంటీ లేదు. మహబూబ్నగర్ కి తాండూర్ నుంచి 90 కిలోమీటర్ల దూరం ఉంటుంది. దాదాపు 50 కి పైగా గ్రామాలు ఇదే మార్గంలో ఉంటాయి. నిత్యం వేల మంది తాండూర్ మహబూబ్నగర్కు ప్రయాణం చేస్తుంటారు. ఎంత బాగానే ఉన్నా ఐదు నిమిషాలకు ఒకసారి బస్సు వస్తేనే బస్సు ఫుల్ గా వెళ్ళేది. అలాంటిది ఇప్పుడు 30 నిమిషాలకు ఒక బస్సు వెయ్యడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అదేవిధంగా సంగారెడ్డికి కూడా తాండూర్ నుంచి 30 నిమిషాలకు ఒక బస్సు వెళ్ళేది అలాంటిది ఎప్పుడు రెండు గంటలు అయినా ఒక వస్తువు కూడా లేదు ఒక వస్తువు వెళ్లిందంటే మరో బస్సు ఎప్పుడు వస్తుందో కూడా ప్రయాణికులకు తెలియడంలేదు.రాష్ట్రరాజధాని అయినటువంటి హైదరాబాద్కు కూడా సరైన బస్సు సౌకర్యాలు లేవు. ఇదే మార్గంలో వికారాబాద్ కూడా ఉంటుంది వెళ్లడానికి సరైన బస్సులు ఉండవు.

### పట్టించుకోని ఎంక్వైరీ ఆఫీస్

తాండూరులో పేరుకు మాత్రమే ఎంక్వయిరీ ఆఫీస్ ఉంది. బస్సుల సమయపాలన ఎప్పుడు వస్తాయి ఎప్పుడు వెళ్తాయో ప్రజలకు నిత్యం సమాచారం అందించవలసి ఉంటుంది కానీ అక్కడ ఒక్క ఆఫీసర్ కూడా ఉండదు ఒక బస్సు వచ్చిందా రాలేదా అని తెలియని ప్రజలు అలగాలంటే సామాన్యంగా ఇంక్వైరీ ఆఫీసుకు వెళ్లి అడగాలి కానీ తాండూర్ లో మాత్రం కిరాణా షాపుల అవ్వాలని లేదా బస్సు కోసం నిలబడ్డవ్వాలని అడగడం తప్ప మరేమీ చేయలేకపోతున్నారు. పలు సమాచారం సరిగ్గా ఇస్తారన్న గారికి కూడా ఉండదు.

### ఆర్టీసీ ఆదాయంలో తాండూరు టాప్

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆర్టీసీ నుంచి వచ్చే ఆదాయ మార్గాలలో తాండూర్ పట్టణం నుంచే ఎక్కువ ఆదాయం సమకూరుతుంది సుమారుగా రోజుకు 18 నుంచి 22 కోట్ల రూపాయల ఆదాయం ఆర్టీసీకి వస్తుంది. ఇంత భారీగా ఆదాయం వచ్చినా కానీ ఆర్టీసీలోని అధికారులు మాత్రం సరిగా పనిచేయడం. ఎక్కువగా బస్సులు నడపడం లేరు. అసలు గ్రామాలను ఎవరు పట్టించుకోవడం వేరు. పెద్ద పెద్ద గ్రామాలకు ఒక బస్సు ప్రతిరోజు అదే నడిచేది. అలాంటిది ఇప్పుడు రోజుకు రెండు పూటలు రావడమే గగనం అయిపోయింది. దయచేసి బస్సులను సకాలంలో నడిపే ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించకూడదని ప్రజలు కోరుకుంటున్నారు.

# మట్టి గణేషునికి జై..!

- ❖ భారీ విగ్రహం వద్దు.. పర్యావరణమే ముద్దు
- ❖ పెద్దల మాటకు విలువ.. యువత స్ఫూర్తి
- ❖ ఆదర్శంగా నిలుస్తున్న గుమస్తానగర్ ఉత్సవ కమిటీ

**దశ, తాండూర్ ప్రతినిధి :** వినాయక చవితి ఉత్సవాలంటే భారీ విగ్రహాలు.. హంగామా.. ఆర్భాటం అన్నట్లుగా మారుతున్న తరుణంలో గుమస్తానగర్ యువకులు మాత్రం పర్యావరణ పరిరక్షణకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. భారీ విగ్రహం ప్రతిష్టించే నిర్ణయాన్ని.. మానుకుని పెద్దల సూచనను పాటిస్తూ మట్టి గణపతిని ప్రతిష్ఠించేందుకు నిర్ణయించారు.వార్డు నంబర్ 26 గుమస్తానగర్, విజ్ఞానపురి కాలనీలోని శ్రీ విద్యా వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 40 ఏండ్లుగా భారీ వినాయక విగ్రహం ప్రతిష్టించే వారు. ఈ ఏడాది 41వ సంవత్సరం వినాయక ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు చేసిన సూచన మేరకు కుల్కచర్ల వద్ద మట్టి విగ్రహాల తయారీదారు స్వామి వద్ద ఏడు అడుగుల గంగా మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాన్ని బుక్ చేశారు.పూజల అనంతరం



మట్టి విగ్రహం సులభంగా ప్రకృతిలో కలిసిపోయేలా ఉండటంతో పర్యావరణానికి మేలు జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. పెద్దల సూచనను ఆచరణలో పెట్టి.. పర్యావరణ పరిరక్షణకు తమవంతు బాధ్యతగా మట్టి గణపతిని ఎంచుకున్న గుమస్తానగర్ యువత పలువురి ప్రశంసలు అందుకుంటోంది.వినాయక ఉత్సవాల్లో భక్తితో పాటు పర్యావరణ స్పృహను చాటుతున్న ఈ నిర్ణయం ఇతర ఉత్సవ కమిటీలకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



## ఘట్‌కేసర్–కాజీపేట రైల్వే ప్రాజెక్టుకు రూ.2,419 కోట్లు

**దశ, హైదరాబాద్:** ఘట్‌కేసర్-కాజీపేట మధ్య 110 కిలోమీటర్ల రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టుకు రూ.2,419 కోట్లతో ఆమోదం లభించడంపై మాజీ ఎంపీ, బీజేపీ తెలంగాణ ఉపాధ్యక్షుడు డా. బూర నర్సయ్య గౌడ్ ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సుమారు 2029-30 నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్-కాజీపేట రైల్వే కారిడార్‌లో సామర్థ్యం పెరిగి నాలుగు లైన్ల సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. రైళ్ల రద్దీ, ఆలస్యాలు తగ్గడంతో పాటు ప్రయాణికులు, సరుకు రవాణా సేవలు మెరుగుపడతాయన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, జనగామ, వరంగల్ జిల్లాలకు ఈ ప్రాజెక్టు ప్రయోజనం చేకూరుస్తుందని నర్సయ్య గౌడ్ పేర్కొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ కోసం భానుపురి ప్రభాత ర్యాలీ

- ❖ బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట మీదుగా వెళ్లే వరకు ఉద్యమం ఆగదు

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** శంషాబాద్-చెన్నై బుల్లెట్ ట్రైన్‌ను సూర్యాపేట మీదుగా నడిపించే ప్రతిపాదన ఖరారు చేసే వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని సూర్యాపేట పట్టణ వర్తక, వ్యాపార, వాణిజ్య, విద్యా, వైద్య, వృత్తి సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. గురువారం ఉదయం సద్దలచెరువు బతుకమ్మ ఘాట్ వద్ద ఉన్న దీక్షా శిబిరం నుంచి శంకర్ విలాస్, ఎంజీ రోడ్డు మీదుగా కొత్త బస్టాండ్ వరకు భారీ ప్రభాత ర్యాలీ నిర్వహించారు. సుమారు 500 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. శంషాబాద్ నుంచి చెన్నైకి వెళ్లే బుల్లెట్ ట్రైన్‌ను జాతీయ రహదారి 65 మీదుగా సూర్యాపేట-కోదాడ-నందిగామ-అమరావతి మీదుగా చెన్నైకి వెళ్లే విధంగా గతంలో ప్రతిపాదించిన అలైన్‌మెంట్ ప్రకారం ఖరారు చేయాలని వారు డిమాండ్ చేశారు. 52 రోజులుగా కొనసాగుతున్న బుల్లెట్ ట్రైన్ సాధన ఉద్యమానికి అన్ని వర్గాల ప్రజలు, వ్యాపారులు, సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అవసరమైతే దశలవారీగా మరిన్ని ఆందోళనలు చేపడతామని, పట్టణ బంద్‌కు సైతం వెనకాడబోమని ప్రకటించారు. కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ వద్ద ర్యాలీలో పాల్గొన్నవారు మానవహారం నిర్వహించి బుల్లెట్ ట్రైన్ సాధనకు తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ వర్తక, వాణిజ్య, వ్యాపార సంఘాల ప్రతినిధులతో పాటు ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు, వైద్యులు, వృత్తి సంఘాల నాయకులు, బుల్లెట్ ట్రైన్ సాధన ఉద్యమ నేతలు పాల్గొన్నారు.




## రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్‌తో ట్రెసా నేతల భేటీ



**దశ, రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డిని నూతనంగా ఎన్నికైన తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) రాష్ట్ర అధ్యక్షుడు కె. గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎల్. రమణ్‌రెడ్డి బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఆర్డీవో పార్థసింహారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగమణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బొమ్మ రాములు, సంయుక్త కార్యదర్శులు బోయిని కృష్ణయ్య, వాణిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జనార్ధన్, తహసీల్దార్లు ఎండీ అన్వర్, నాగయ్య, టి. సైదులు, డిప్యూటీ తహసీల్దార్లు జంగయ్య, ప్రియాంక పాల్గొన్నారు. ట్రెసా కార్యవర్గ సభ్యులు సరిత, విక్రమ్‌రెడ్డి, పాండు, నవీన్, శ్రీనయ్య, సురేష్, నవీన్, ఉదయ్ తదితరులు హాజరయ్యారు.

## ప్రభుత్వ పథకాలు.. రుణాలు అర్హులకు చేరాలి




**దశ, రంగారెడ్డి :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సంస్థాగత రుణాలు అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో చేరేలా అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి సూచించారు. ఎల్‌డీఎం సుశీల్‌కుమార్ కె.పి. ఆధ్వర్యంలో 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామీణ ప్రజలకు ఉపాధి, జీవనోపాధి అవకాశాలు పెంచేందుకు ఇప్పటికే అమలులో ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పథకాలను సమన్వయం చేస్తూ సమగ్ర పథకం రూపొందించాలని ఎల్‌డీఎం, పీడీడీఆర్‌డీఏను కలెక్టర్ ఆదేశించారు. పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యకు అవకాశం కల్పించేలా విద్యా రుణాల మంజూరుపై బ్యాంకర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి బ్యాంకింగ్ సేవలు, రుణ సదుపాయాలు అందేలా బ్యాంకర్లు చొరవ చూపాలని కలెక్టర్ కోరారు. అన్ని బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని ఎల్‌డీఎం సుశీల్‌కుమార్ కోరారు. సమావేశంలో నాబార్డ్, ఆర్‌బీఐ ప్రతినిధులు ఆర్థిక సమ్మిళితం, వెనుకబడిన వర్గాలకు రుణాల విస్తరణ, రుణాల పంపిణీ వ్యవస్థ బలోపేతంపై సూచనలు చేశారు.

# వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలి

❖ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** వీరనారి చాకలి ఐలమ్మ చూపిన ధైర్యం, పోరాట పటిమ తరతరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహలు అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో అణచివేత, భూస్వామ్య వ్యవస్థకు ఎదురొడ్డి నిలిచిన ఐలమ్మ చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, ఆమె స్ఫూర్తితో సమాజ పురోగతికి కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ చూపిన తెగువ, పోరాట స్ఫూర్తి నేటి సమాజానికి ఆదర్శనీయమని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని, అన్యాయాలను ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించే చైతన్యం కల్పించాలని సూచించారు. మహిళా భద్రత, చైతన్యంపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, బీసీ వెల్ఫేర్ అధికారి విశాల్, డాక్టర్ ఊరా రామ్మూర్తి యాదవ్, భోమ్మగాని శ్రీనివాస్, బంటు కృష్ణ, చింతలపాటి చిన్న శ్రీరాములు, మట్టిపల్లి సైదులు, పోతుగంటి వీరాచారి, చల్లమల నరసింహ, తల్లమల్ల హుశేన్, ధున్నా శ్యామ్, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దొరలపై తిరుగుబాటు చేసిన వీరనారి చాకలి అవిలమ్మ

❖ వర్ధంతి సందర్భంగా తుంగతుర్తిలో నివాళులర్పించిన BRS నాయకులు



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి చిట్యాల అవిలమ్మ వర్ధంతి సందర్భంగా తుంగతుర్తి BRS పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా BRS మండల అధ్యక్షులు, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య మాట్లాడుతూ.. ఇసునూరు దేశ్‌ముఖ్ ఆగడాలను ఎదిరించి, తన పొలంలో పండిన పంటను అక్రమంగా దోచుకుంటున్న గుండాలకు ఎదురొడ్డి పోరాడిన వీరనారి చాకలి అవిలమ్మ పోరాటం అజరామరమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, పట్టణ అధ్యక్షులు గొప్పగాని శ్రీనివాస్, గోపగాని వెంకన్న, మండల నాయకులు గుడిపాటి వీరయ్య, మల్లేపాక రాములు, గడ్డం సోమేశ్, పాలడుగు జాలంధర్, తాళ్లపెల్లి యాకయ్య, బొజ్జ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# సాయుధ పోరాట నిప్పు రవ్వ కామ్రేడ్ ఐలమ్మ

❖ రజకసంఘం ఆధ్వర్యంలో ఘనంగాఐలమ్మ 41వ వర్ధంతి

**దశ, మునగాల:** భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం నాడు దొరలు భూస్వామ్ల్ని ఎదిరించి తమ హక్కుల కోసం పోరాడిన వీర నారీమణి చిట్యాల ఐలమ్మ అని మునగాల రజక సంఘం అధ్యక్షుడు తంగేళ్ల నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాడు తెలంగాణలో దున్నేవానికి భూమి కావాలని వెట్టిచాకి రద్దు కావాలని నైజాం నవాబ్ గద్దె దిగాలని సాగిన రైతాంగ సాయుధ పోరాటంలో ఐలమ్మ సాగించిన పోరాటం అజరామరమన్నారు. మట్టి మనుషులచే బంధుకు చేపట్టి విసునూరు రామచంద్రారెడ్డికి ముచ్చెమటలు పట్టించిన వీర వనిత చాకలి ఐలమ్మని ఆయన అన్నారు. నాడు సాగిన భూ పోరాటం స్ఫూర్తితో పాలకవర్గాలు భూ సంస్కల చట్టాలు తెచ్చి పేదలకు భూములు పంచిన చరిత్ర ఆమె సొంతమన్నారు. ఐలమ్మ జయంతి మరియు వర్ధంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై ఆమె విగ్రహాన్ని నిర్మాణం చేసి ఆవిష్కరించాలని, యావత్తు తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి ఆమె చరిత్ర తెలిసేలా ఘనంగా ఆవిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈసందర్భంగా మునగాల గ్రామ రజక సంఘం నాయకులు కొవ్వొత్తులు వెలిగించి ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజకసంఘం నాయకులు సిహెచ్ సీతారాం, ముక్కోళ్ల వెంకటేశ్వరరావు, తంగేళ్ల వెంకన్న, తంగేళ్ల శివ, తంగేళ్ల సాంబ, గరపాకుల నాగరాజు, తంగేళ్ల నాగరాజు, సిద్దుల శ్రీను, బుచ్చయ్య, కోటేశ్వరరావు, తాళ్లూరి రాము, నవీన్, తంగేళ్ల శ్రీను, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ బాధ్యతలతోనే పీహెచ్‌డీ సాధించిన దీపా బానోత్




**దశ ఓయూ:** ఈసీఐఎల్‌కు చెందిన ఉస్మానియా విశ్వవిద్యాలయం బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగ పరిశోధక విద్యార్థిని డా. దీపా బానోత్ పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఇద్దరు పిల్లల తల్లిగా కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ పొందడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. తెలంగాణలో ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగుల సంతృప్తిపై తులనాత్మక అధ్యయనం అంశంపై ఆమె పరిశోధన చేశారు. ఉన్నత విద్యాసంస్థల్లో ఉద్యోగుల సంతృప్తి మెరుగుదలకు పలు సూచనలు ప్రతిపాదించారు. డా. వి. సమున్నత పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీరాములు, డీన్ ప్రొఫెసర్ జహంగీర్, విభాగాధిపతి ప్రొఫెసర్ విద్యాసాగర్‌రావు, అధ్యాపకులు, పరిశోధకులు, సిబ్బంది ఆమెను అభినందించారు. పెద్ద కుమారుడు ఎంబీబీఎస్, చిన్న కుమారుడు ఇంజినీరింగ్ చదువుతున్న సమయంలో కుటుంబ బాధ్యతలను చూసుకుంటూనే పీహెచ్‌డీ సాధించడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని దీపా బానోత్ తెలిపారు. తన భర్త రవి తేజ, కుటుంబ సభ్యులు, పరిశోధన పర్యవేక్షకురాలు డా. వి. సమున్నత అందించిన ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె విజయం కుటుంబ బాధ్యతలతో పాటు ఉన్నత విద్యను కొనసాగించాలనుకునే మహిళలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

❖ ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా స్థానిక జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. దొరల పెత్తనానికి ఎదురొడ్డి పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. ఆమె పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి రాజా, సట్టు నాగయ్య, వెలుగు వనిత, బూర వెంకటేశ్వర్లు, ఎం. డేవిడ్ కుమార్, బొమ్మగాని శ్రీనివాస్, పోలెబోయిన కిరణ్, నారబోయిన కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అభాగ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి గణపతుల ఉచిత పంపిణీ



**దశ, ఓయూ:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా అభాగ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ లక్కరాజు నిర్మల 30 ఏళ్లుగా మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది 100 మట్టి గణపతులను ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఓయూ పోలీస్‌స్టేషన్, తార్నాక ప్రాంతాల్లో పంపిణీ చేశారు. పర్యావరణాన్ని కాపాడితేనే భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందని నిర్మల తెలిపారు. కార్యక్రమంలో నరసింహారావు, లత, విద్య, రమ, సావిత్రి, సుధ, అబ్బవరపు రమ తదితరులు పాల్గొన్నారు.

# దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం సరికాదు

❖ ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి



**దశ, ఓయూ:** మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్దకు దళితులు వచ్చినందుకు బీఆర్ఎస్ నాయకులు పసుపు నీటితో శుద్ధి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల వద్ద నిరసన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శించిన ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి మాట్లాడుతూ.. దళితులను చిన్నచూపు చూడటం, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ నాయకులు దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను కూడా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధుల పట్ల అసభ్య పదజాలం ఉపయోగించడం బాధ్యతారాహిత్యమన్నారు. రానున్న ఎన్నికల్లో కేటీఆర్, హరీశ్‌రావులను ఓడిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రమేష్, రాజేందర్, చరణ్, స్వామి అరుణ్, ఆకాష్, కుశాల్, ఆంజనేయులు, వెంకటేష్, అఖిల్, రాజు, సాయి, రాము, శివ తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి విద్యార్థి నాయకుల అరెస్టు దారుణం

❖ బీఆర్ఎస్ మాజీ యువజన అధ్యక్షుడు ఆలకుంట హరి



**దశ, ఓయూ:** ఉస్మానియా విశ్వవిద్యాలయం హాస్టల్‌లో నిద్రిస్తున్న బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులను అర్ధరాత్రి పోలీసులు అదుపులోకి తీసుకోవడం దారుణమని బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ మాజీ యువజన అధ్యక్షుడు ఆలకుంట హరి ఖండించారు. ఎలాంటి నిరసన, ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనని విద్యార్థులను రాత్రి 1-2 గంటల సమయంలో హాస్టల్ నుంచి పోలీస్‌స్టేషన్‌కు తరలించి నిర్బంధించడం ఏమిటని ప్రశ్నించారు.విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసి వారి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే సహించబోమన్నారు. అకారణంగా అరెస్టు చేసిన విద్యార్థి నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.



# పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం.!!

**దశ, కామేపల్లి:** ప్రతి ఒక్కరూ పోషణతో కూడిన ఆహారం తీసుకోవాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కామేపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ , సీడీపీవో కె.ఉమ, కొమ్మినేపల్లి సర్పంచ్ ధరవాత్ అనురాధ అన్నారు. గురువారం కామేపల్లి మండలం,కొమ్మినేపల్లి1 అంగన్వాడీ కేంద్రంలో పండుగలా, ఘనంగా నిర్వహించిన 9వ,జాతీయ పోషణ మాసోత్సవ వేడుకల లో వారు పాల్గొని అందుబాటులో ఉన్న ఆహార పదార్థాలపై తల్లులకు, యుక్త వయస్సు బాలికలకు అవగాహన కల్పించి చైతన్య పరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రతిరోజు సరైన పోషకాలు ఉన్న పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే మనం శారీరకంగా, మానసికంగా సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చు అన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. గ్రామంలో లభించే ఆహార పదార్థాలైన పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, మాంసం ఉత్పత్తులు, చేపలలో ఎలాంటి పోషకాలున్నాయనేది వారికి వివరించారు. ప్రధానంగా తల్లుల ఆరోగ్యం, పరిశుభ్రత, పోషకాహారం, జంక్ ఫుడ్ వలన జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సరైన పోషకాహారం తీసుకోకుండా చాలా మంది రోగాల బారిన పడి ఆసుపత్రులు, మందులంటూ డబ్బు వృధా చేస్తున్నారని, ఈ పద్ధతి మారాలి అన్నారు. ఈనెల 9 నుండి అక్టోబర్ 9, 2026 వరకు జాతీయ పోషణ మాసం వేడుకలు కొనసాగుతాయని వెల్లడించారు. ఈ కార్యక్ర మంలో ముచ్చర్ల సెక్టార్ సూపర్వైజర్ టి. విజయలక్ష్మి, అంగన్వాడీ టీచర్ అరుణ, తల్లులు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓయూలో ఐయూఈసీ జాతీయ సదస్సు ప్రారంభం



**దశ, ఓయూ:** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అఖిల భారత విశ్వవిద్యాలయ ఉద్యోగుల సమాఖ్య (ఐయూఈసీ) ఆధ్వర్యంలో 'ఉన్నత విద్య-ప్రస్తుత స్థితిగతులు' అంశంపై 15వ జాతీయ సదస్సు గురువారం ఠాగూర్ ఆడిటోరియంలో ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 400 మంది ప్రతినిధులు, వెయ్యి మందికి పైగా పాల్గొంటున్నారు. ఓయూ ఎన్జీవోల సంఘం, స్టాఫ్ అసోసియేషన్, టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్లు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య వి. బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల ఆధునీకరణ, విద్యా ప్రమాణాల పెంపు, ఉన్నత విద్యా సంస్కరణల అమలు అవసరమన్నారు. ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగుల మాట్లాడుతూ దేశ నిర్మాణంలో విశ్వవిద్యాలయాల పాత్ర కీలకమని, బోధనేతర సిబ్బంది, సేవా సంఘాల కృషి అభినందనీయమన్నారు. విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని ఆచార్య కాశీం కోరారు. సదస్సులో విద్యా విధానాలు, పాలనా సంస్కరణలు, పరిశోధన, సిబ్బంది సంక్షేమంపై చర్చలు జరగనున్నాయి.

## భక్తి శ్రద్ధలతో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

**దశ, హుజూర్‌నగర్:** ముత్యాలమ్మ తల్లి జాతరలో భాగంగా పట్టణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా జరిగాయి.జాతర సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది.ఉదయం నుంచే అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం,సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం కనకదుర్గమ్మను పట్టువస్త్రాలు, విశేష పుష్పాలంకరణతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.